క్లుప్తంగా

మహిళలకు క్షేత్రస్థాయి శిక్షణ



సత్యదేవ నర్సరీలో శిక్షణకు హాజరైన మహిళల బృందం, నర్సరీ రైతులు

కడియం: మహిళలకు సాధికారిత, నర్సరీ డెవలప్‌మెంట్ అండ్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ శిక్షణలో భాగంగా తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన 70 మంది మహిళలు శనివారం కడియపులంకలోని పుల్లా ఆంజనేయులకు చెందిన శ్రీ సత్యదేవ నర్సరీని సందర్శించారు. గ్రామీణ ఫౌండేషన్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ (ఎన్జీవో) సంస్థ ఆధ్వర్యంలో మహిళల బృందానికి ఈ క్షేత్రస్థాయి పర్యటనను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. నర్సరీలో మొక్కల గ్రాఫ్టింగ్, కటింగ్, ఫ్రూటీ కట్టుబడి తదితర అంశాలను నర్సరీ అధినేతలు వారికి వివరించారు. సంబంధిత సంస్థ ప్రతినిధులు, స్థానిక నర్సరీ రైతులు పాల్గొన్నారు.

నర్సరీని సందర్శించిన మద్రాస్ హైకోర్టు జడ్జి

కడియం: మద్రాస్ హైకోర్టు జడ్జి వీ శ్రీశివజ్ఞానం కడియపులంకలోని పుల్లా ఆంజనేయులకు చెందిన శ్రీ సత్యదేవ నర్సరీని శనివారం సందర్శించారు. ఆయనకు ఆంజనేయులు మొక్కను అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం వివిధ రకాల పండ్లు, పువ్వుల మొక్కలను ఆయన పరిశీలించారు. కడియం ప్రాంతాన్ని నర్సరీ రైతులు ఈ ప్రాంతాన్ని ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారని జడ్జి ఈ సందర్భంగా రైతులను అభినందించారు. ఆయన వెంట వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

బోయి భీమన్న జీవితంపై నేడు సాహిత్య సదస్సు

సీటీఆర్ఐ: మహాకవి, పద్మభూషణ్ బోయి భీమన్న జీవితం –సాహిత్యంపై రాజమహేంద్రవరంలో ఈ నెల 23న జాతీయ సాహిత్య సదస్సు నిర్వహిస్తున్నట్లు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈఓ కత్తిమండ ప్రతాప్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో ఆదివారం ఉదయం 10 నుంచి నిర్వహించనున్న సదస్సులో 100 మంది పత్ర సమర్పణ చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు అసోసియేషన్ నేషనల్ బుక్ ఆఫ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి హాజరవుతారన్నారు. సదస్సులో పాల్గొన్న వారికి జ్ఞాపిక, శాలువా, ప్రశంసాపత్రంతో సత్కరించనున్నట్లు ప్రతాప్ తెలిపారు. సదస్సు కన్వీనర్‌గా డాక్టర్ పార్థసారథి వ్యవహరిస్తారన్నారు. యూనివర్సిటీ పరిశోధక విద్యార్థులు, సాహితీ వేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. సాహితీప్రియులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

మహాలక్ష్మి అమ్మవారి తీర్థానికి ఏర్పాట్లు

కడియం: కడియపులంకలోని మహాలక్ష్మి అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేసారు. ఈనెల 25న అమ్మవారి గరగలను ఎత్తడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని వివరించారు. 29న శనివారం రాత్రి అమ్మవారి జాతర, 30న తీర్థం, ఏప్రిల్ 4న శుక్రవారం అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చెప్పారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రకాశం నగర్: దూబచర్లలో రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కి జరిగిన అవమానంపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు చేపట్టి, నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల విద్వేష కులతత్వ రాజకీయాల్లో భాగంగానే దుండగులు అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండలు వేసి అవమానించారని, ఈ హేయమైన చర్యను సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు.

అభ్యంతరకర పోస్టింగులపై కఠిన చర్యలు

కంబాలచెరువు: సోషల్ మీడియా వేదికగా ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్, అసభ్యకరమైన, అనైతిక, కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డి.నరసింహకిషోర్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇతరుల మనోభావాలు, మానాభిమానులు దెబ్బతినేలా కుల, మత, రాజకీయ వర్గాల మధ్య విద్వేషాలు రగిల్చేలా, సున్నిత అంశాల్లో వదంతులు, అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించేలా సామాజిక మధ్యమాల్లో తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు గుర్తించామని, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి, కోర్టు ఎదుట హాజరు పరుస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

అప్రమత్తతే ఆయుధం

- గ్రామాల్లో కనిపిస్తున్న ఆటలమ్మ, గవదబిళ్లల కేసులు
- వేసవిలో ఎక్కువ కేసులు నమోదు
- పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



ఆటలమ్మ సోకిన దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: మార్చి నెల ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. వేసవి ఎండలు ముదరడంతో పిల్లల్లో చికెన్‌పాక్స్ (ఆటలమ్మ), గవదబిళ్లల సమస్య పిల్లల్లో అధికంగా కనిపిస్తుంది. వీటి బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు తీవ్రంగా బాధిస్తాయి. అన్ని వయసుల వారికి ఈ అంటువ్యాధులు సోకే అవకాశమున్నా ప్రధానంగా చిన్నారులకు ఎక్కువ ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. అందుకే ముందు జాగ్రత్త, అప్రమత్తతో వ్యవహరిస్తే అంటువ్యాధుల బారినపడకుండా రక్షణ పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. పదేళ్లలోపు చిన్నారులకు ఈ వ్యాధి వస్తుంది. వారి విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆటలమ్మ, గవదబిళ్లలు సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగా తీసుకోలేక తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై నీటి పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రత ఆధారంగా వైద్యుల సూచన మేరకు యాంటీవైరల్, యాంటీ బయాటిక్ మందులు వాడాల్సి ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఆటలమ్మ సోకిన వారిని మిగతా వారికి దూరంగా ఉంచాలి. వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలే ఇవ్వడం మంచిది. గవదబిళ్లలు వచ్చిన వారికి గొంతునొప్పి తీవ్రంగా ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ ద్రవపదార్థాలను ఆహారంగా తీసుకోవాలి. చికెన్‌పాక్స్, గవదబిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహలు, మూఢ నమ్మకాలతో వైద్య సహాయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, అది మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు పిల్లలకు గోరువెచ్చని నీరు, శుభ్రమైన ఆహారం ఇవ్వడంతో పాటు పరిసరాల్ని పరిశుభ్రంగా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వైద్యులను సంప్రదించాలి



ఆటలమ్మ, గవదబిళ్లల వ్యాధులపై నిర్లక్ష్యం తగదు. ప్రస్తుతం చిన్న పిల్లలు ఎక్కువగా ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించగానే వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనలు మేరకు మందులు వాడాలి.

– డాక్టర్ కె.సుధాకర్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, ధవళేశ్వరం

ఆటో కార్మికులకు అండగా ఉంటాం



చలివేంద్రాన్ని ప్రారంభించిన జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: ఆటోడ్రైవర్ల అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. శనివారం నగరంలో స్థానిక వై–జంక్షన్‌లోని శ్రీ వీరాంజనేయ ఆటో స్టాండ్ వద్ద వైఎస్సార్‌టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు అడపా వెంకటరమణ (గెడ్డం రమణ), పార్టీ నాయకుడు అడపా అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి ప్రయాణికులు, వాహనచోదకులకు చల్లని మజ్జిగ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఏటా ఆటో కార్మికులు ఇక్కడ చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రతిరోజు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఆటోడ్రైవర్ల ప్రజాసేవ కార్యక్రమాలను రాజా ప్రశంసించారు. శ్రీ వీరాంజనేయ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను రాజాకు విన్నవించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త సమస్యలు వస్తున్నాయని ఆటో డ్రైవర్లు తెలిపారు. ఆటోను బ్రేక్‌కు తీసుకుని వెళితే ఆర్టీఓ ఆఫీసర్ రూ.1,860 కట్టించుకుంటున్నారని, అక్కడ ఆటో ఇంజన్‌కు మిషన్లు అమర్చి 8 రకాల పరీక్షలు చేస్తున్నారని వివరించారు. ఏ ఒక్క పరీక్ష ఫెయిలైనా మళ్లీ రూ.1,860 చెల్లించి చలానా తీయాల్సి వస్తోందని వాపోయారు. త్వరలోనే అన్ని ఆటో యూనియన్ల నాయకులతో సమావేశం నిర్వహించి జిల్లా రవాణాశాఖాధికారికి వినతిపత్రం సమర్పిద్దామని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉంటామని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బొంత శ్రీహరి, వై.జంక్షన్, నందం గనిరాజు జంక్షన్స్ ఆర్టీసీ కాంప్లెక్స్ స్టాండ్, తాడితోట స్టాండ్, ఎంఎస్ఆర్ హైటెక్ బస్టాండ్ ఆటో స్టాండ్‌ల ప్రతినిధులు ఊడుగుల ఉమా మహేశ్వరరావు, గవర నాగేశ్వరరావు, యు.శ్రీను, బాజీ, ఎం.సుబ్రహ్మణ్యం, సూరిబాబు, మురళీ కృష్ణ పాల్గొన్నారు.

పైపులైను లీకులను అరికట్టాలి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: ఎండలు పెరుగుతున్న దృష్ట్యా తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లకు లీకులను అరికట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగు అధికారులను నగర పాలక సంస్థ కమిషనరు, రుడా వైస్ చైర్మన్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శనివారం స్థానిక 48వ డివిజన్‌లోని సంజీవయ్యనగర్‌లో పీవీసీ పైపు లైన్‌ను మార్చి హెచ్‌డీపీయూ పైపు వేసే పనులను కమిషనరు తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్లలో ఎటువంటి లీకులు ఏర్పడకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నీటి ఎద్దడి లేకుండా నిత్యం పైపులైనులను తనిఖీ చేయాలని అన్నారు. అనంతరం కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలోని గోష్పాద క్షేత్రంలో రుడా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. పుష్కరాల సమయంలో రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌కు సమాంతరంగా భక్తుల రద్దీ గోష్పాదక్షేత్రం రేవుకు కూడా ఉంటుందని అక్కడ ఉన్న గట్టును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ తనిఖీలో ఎగ్జిక్యూటివ్ యింజనీరు మాధవి, అసిస్టెంటు ఇంజనీరు వెంకటేష్, కొవ్వూరు పురపాలక సంఘం కమిషనరు నాగేంద్రకుమార్, అసిస్టెంటు ఇంజనీరు సందీప్, రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఏఐబీఈ ఫలితాల్లో స్విగ్గీ బాయ్ ఉత్తీర్ణత



స్విగ్గీబాయ్ దువ్వూరి రాజ్‌కుమార్

రాజమహేంద్రవరం రూరల్: ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ (ఏఐబీఈ)–19 ఫలితాల్లో లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన స్విగ్గీబాయ్ దువ్వూరి రాజ్‌కుమార్ ఉత్తీర్ణత సాధించాడు. చెస్ క్రీడాకారుడైన దువ్వూరి రాజ్‌కుమార్ విద్యార్థులకు చెస్‌లో శిక్షణనిస్తూ పార్ట్‌టైమ్‌గా స్విగ్గీబాయ్‌గా పని చేస్తున్నారు. న్యాయవాదవృత్తి చేసి పేద ప్రజలకు సేవలందించాలన్న ఆకాంక్షతో కాకినాడ తూరంగి పీఎస్ఆర్ లా కళాశాలలో 2012–24 బ్యాచ్‌లో బీఎల్ పూర్తి చేశారు. శుక్రవారం విడుదల చేసిన ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ ఫలితాల్లో ఆయన ఉత్తీర్ణత సాధించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో పేదలకు ఉచితంగా న్యాయసేవలను అందించేందుకు తన వంతు సహాయం చేస్తానన్నారు. ఈ సందర్భంగా దువ్వూరిని పలువురి న్యాయవాదులు అభినందించారు.

విక్రమహాలు పునర్నిర్మాణానికి కృషి



విక్రమహాలు పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాబోవు పుష్కరాలలోపు విక్రమహాలు పునర్నిర్మాణానికి కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. చారిత్రక కట్టడం విక్రమహాలుపై రాకా సంస్థ రూపొందించిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం విక్రమ హాలులో శనివారం రాత్రి నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి జీవీ రమణ సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని విక్రమహాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. విక్రమహాలు కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు, విశ్రాంత అధ్యాపకులు, తెలుగు వెలుగు డాక్టర్ అరిపిరాల నారాయణరావు, విక్రమ హాలు కార్యదర్శి అశోక్ కుమార్ జైన్, కోశాధికారి వాడ్రేవు మల్లపరాజు మాట్లాడుతూ విక్రమహాలును అభివృద్ధి చేయాలని కోరారు. పుస్తక రూపకల్పనలో సహకరించిన వారికి, స్వతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేసారు. జీవీ రమణ ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహించారు. అనంతరం కందుల దుర్గేష్‌ను, అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తోట సుబ్బారావు, వేగిశెట్టి కోదండ రామారావు, క్రొవ్విడి సుబ్రహ్మణ్యం, గోదావరి కల్చరల్ అసోసియేషన్ కార్యాధ్యక్షుడు యరమ్రోతు ధర్మరాజు, ఉపాధ్యక్షుడు జీవీఆర్ జగన్నాథం, ప్రధాన కార్యదర్శి ఎం ఏడుకొండలు, కార్యదర్శి గాదిరాజు రామరాజు, కోశాధికారి సూరపురెడ్డి తాతారావు, సహాయ కార్యదర్శి గౌరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత జిల్లాగా తీర్చి దిద్దుదాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): తూర్పుగోదావరిని సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా నాటు సారా నిర్మూలన లక్ష్యంగా, సారా తయారీ, రవాణా చేస్తూ పట్టుబడిన వారిని సక్రమమైన మార్గంలో తీసుకుని రావడం ద్వారా సత్ఫలితాలు సాధించడం సాధ్యమవుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో నవోదయం 2.0 కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేసిన అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నాటు సారా తయారీ, రవాణా, విక్రయాలు చేసే సుమారు 400 మంది వ్యక్తులపై బైండోవర్ నమోదయ్యాయన్నారు. వారిని జనజీవన స్రవంతిలో భాగస్వామ్యం చేసి, గౌరవప్రదమైన జీవన భృతి కల్పించడంలో భాగంగా వారికి ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణనివ్వడంతోపాటు వారి కులవృత్తులు తెలుసుకుని ప్రోత్సహించాలన్నారు. స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలను వారికి వివరించాలన్నారు. వారిని చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ప్రజలు, విద్యార్థుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించాలని అన్ని జిల్లా అధికారులకు సూచనలు జారీ చేశారు.

ఇంటి పన్నుల వసూలు వేగవంతం

పెదపూడి: మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూళ్లు 90 శాతం మేర పూర్తయిందని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన సంపరలో ఇంటి పన్నులు వసూలు వసూలు చేస్తున్న ప్రక్రియను పరిశీలించి మాట్లాడుతూ మండలంలో మొత్తం రూ.1,49,67,316 వసూలు చేయాల్సి ఉండగా వాటిలో రూ.1,34,70,584 వసూలు పూర్తి చేశారన్నారు.

చిత్ర కళా నైపుణ్యంతో జీవన వికాసం

గువ్వల కెనడీ స్మారక చిత్ర కళా ప్రదర్శన ప్రారంభించిన రౌతు

సీటీఆర్ఐ: చిత్ర కళా రంగంలో సాధించిన నైపుణ్యం మనిషి జీవన వికాసానికి దోహదం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. క్రియేటివ్ వరల్డ్ ఆధ్వర్యంలో కళాస్మృతి పేరితో దివంగత చిత్ర కళాకారుడు గువ్వల కెనడీ స్మృత్యర్థం శనివారం స్థానిక గౌతమ ఘాట్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల చిత్ర కళా ప్రదర్శనను రౌతు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంకేతికంగా మనం ఎంత ఎదిగినా, సహజ సిద్ధమైన చిత్ర కళా ప్రదర్శనను చూసినప్పుడు పొందే అనుభూతి మధురంగా ఉంటుందని అన్నారు. కెనడీ చిత్రీకరించిన కొన్ని కళా చిత్రాలను దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీలో పెట్టేందుకు పెద్దలతో కలసి కృషి చేస్తానని చెప్పారు. ఎందరో కళాకారులు జన్మించిన రాజమండ్రిలో గువ్వల కెనడీ చిత్రించిన కళా ఖండాలు అద్భుతమైనవని గుర్తు చేశారు. కెనడీ చిత్ర కళా వారసత్వాన్ని వారి భార్య, పిల్లలు కొనసాగించడాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కళా స్మృతి 2025 పేరిట ముద్రించిన బుక్‌లెట్‌ను రౌతు సూర్యప్రకాశరావు ఆవిష్కరించారు. కళాకారుల స్మృతిని చిరస్థాయిగా నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కళాస్మృతి నిర్వాహకులు గువ్వల పద్మ, గువ్వల హిమబిందు వర్మ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు మన సంస్కృతిలో భాగమైన చిత్ర కళా నైపుణ్యాన్ని తెలియజేసేందుకే ఈ చిత్ర కళా ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అందరూ ఈ ప్రదర్శనను తిలకించి సహకారం అందించాలని కోరారు. ఆదివారం కూడా చిత్ర కళా ప్రదర్శన, విక్రయాలు కొనసాగుతుందని వివరించారు.

పోక్సో చట్టంతో లైంగిక వేధింపుల నుంచి రక్షణ



గంధం సునీత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): లైంగిక వేధింపుల నుంచి బాల బాలికలకు రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం రూపొందించారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టులో నల్సా, ఏపీఎస్ఎల్ఎస్ఏ నేతృత్వంలో పోక్సో చట్టం, బాధితుల పరిహార పథకంపై వర్క్‌షాప్‌ను పోలీస్, మహిళా శిశు సంక్షేమ, ఇతర సమన్వయ శాఖల అధికారులతో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా జడ్జి గంధం సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ పిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడం కోసం, రక్షణ కల్పించడం కోసం పోక్సో చట్టాన్ని భారత ప్రభుత్వం రూపొందించిందన్నారు. వికృత చేష్టలతో చిన్నారులను శారీరకంగా, మానసికంగా వేధిస్తే నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. పోక్సో చట్టంపై అధికారులందరికీ అవగాహన ఉండాలన్నారు. ప్రతి జిల్లాలో ఒక పోక్సో కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం పోక్సో కోర్టు కాకినాడలో ఉందని, మరో కోర్టు ఏర్పాటు చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని కోరిందన్నారు. 14 ఏళ్లలోపు బాలికలకు పోక్సో చట్టం ద్వారా పూర్తి న్యాయాన్ని అందించేందుకు జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నియామకం పొందిన వారంతా కృషి చేయాలన్నారు. ఈ వర్క్‌షాప్‌లో 1వ అదనపు జిల్లా జడ్జి ఆర్.శివకుమార్, 10వ అదనపు జిల్లా జడ్జి ఆర్.శ్రీలత, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఎన్ శ్రీలక్ష్మి, అదనపు ఎస్పీ క్రైమ్ ఎల్.అర్జున్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయ కుమారి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆడవారి విజయమే కుటుంబ విజయం



ఉద్యోగ నైపుణ్య శిక్షణ పొందిన విద్యార్థినులు, అధ్యాపకులు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఆరు రోజుల పాటు మహిళలకు నిర్వహించిన మహిళా ఉద్యోగ నైపుణ్య శిక్షణ శనివారంతో ముగిసింది. ఆర్ట్స్ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రామచంద్ర ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆడవారి విజయమే కుటుంబ విజయమని పేర్కొన్నారు. ప్రతి విషయాన్ని ఒక నిర్దిష్టమైన దృష్టితో కాక ఆ గీత దాటి చూడగలిగితే కొత్త పరిశోధనలకు నాంది పలికినవారవుతారన్నారు. రసాయన శాస్త్ర విభాగానికి చెందిన ఎస్‌టీసీ సమన్వయకర్త బి.వెంకటరావు మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం, నాంది ఫౌండేషన్, మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. 58 మంది విద్యార్థినులు శిక్షణ పొందారని, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. హైదరాబాద్ నాంది ఫౌండేషన్‌కు చెందిన వి.చైతన్య మాట్లాడుతూ శిక్షణాంశాలు వివరించారు. టీటీపీ సమన్వయ కర్త డాక్టర్ నూజిల్ల శ్రీనివాస్, జేకేసీ మెంటర్ ఎం.కిరణ్‌కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ పద్మావతి పాల్గొన్నారు.

గ్రూప్ 2 అభ్యర్థులకు న్యాయం చేయాలి



గవర్నర్‌ను కలసిన జీవీ సుందర్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించిన గ్రూప్2 అభ్యర్థులు నియామక ప్రక్రియలో న్యాయం చేయాలని అభ్యర్థుల తరపున నగరానికి చెందిన జీవీ సుందర్ శనివారం రాష్ట్ర గవర్నర్‌ను కలసి వినతిపత్రం అందజేసారు. ఫిబ్రవరి 23తో గ్రూప్–2 మెయిన్స్ పరీక్ష ముగిసినప్పటికీ, ప్రభుత్వం కావాలని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయకుండా అభ్యర్థుల భవిష్యత్తును సంక్షోభంలోకి నెట్టివేస్తోందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ పరీక్ష విషయంలో ఐదు రిట్ పిటిషన్లు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని, మూడుసార్లు విచారణ జరిగినా ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.83 లక్షల మంది అభ్యర్థులు అనిశ్చితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని వినతి పత్రంలో డిమాండ్ చేసారు.

సంకల్ప్ జాబ్ మేళాలో 204 మంది ఎంపిక

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో నిర్వహించిన సంకల్ప్ జాబ్ మేళాలో జిల్లా వ్యాప్తంగా 503 మంది హాజరుకాగా 204 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే పేర్కొన్నారు. కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళా ప్రారంభ సభలో జాయింట్ కలెక్టర్ చినరాముడు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులందరూ ఈ సంకల్ప ఉద్యోగ మేళాలో వచ్చిన ఉద్యోగాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వీడీజీ మురళి కంపెనీ ప్రతినిధులను పరిచయం చేస్తూ, ఉద్యోగ అవకాశాలను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ కళాశాలలో ఈ విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో సంకల్ప్ జాబ్ మేళ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ జాబ్ మేళాలో 33 కంపెనీలు పాల్గొన్నాయని కళాశాల జేకేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్‌రెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళాలో కళాశాల ఇంటర్న్‌షిప్ కో–ఆర్డినేటర్ వై.రాము, కళాశాల అధ్యాపక సిబ్బంది, జేకేసీ కమిటీ సభ్యులు, ప్లేస్‌మెంట్ ట్రైనర్ ఎం.కిరణ్ కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

దూసుకొచ్చిన వ్యాన్.. ఒకరికి గాయాలు



వేమగిరి జంక్షన్ వద్ద ప్రమాద దృశ్యం

కడియం: వేమగిరి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ ఢీకొని నర్సాపురానికి చెందిన తోట సతీష్ గాయాలపాలయ్యాడు. అరటి గెలల లోడుతో వెళుతున్న వ్యాన్ సతీష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి, డివైడర్‌పై ఉన్న స్తంభాన్ని తాకి ఆగింది. ఆ సమయంలో రోడ్డుపై జనసంచారం ఎక్కువగానే ఉన్నప్పటికీ ఒక్కరు మాత్రమే ప్రమాదం బారిన పడ్డారు. మిగిలిన వారు అదృష్టవశాత్తు తప్పించుకోగలిగారు. గాయాల పాలైన వ్యక్తిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అతడి గాలికి గాయమైందని అతడికి వైద్యులు చికిత్స అందిస్తున్నారని పోలీసులు చెప్పారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

సినిమాలు



శ్యామల	:	పెళ్లికానిప్రసాద్
సూర్యమినీ	:	కాలమేగాకరిగింది, దిల్‌రూబా
సూర్యప్యాలెస్	:	టక్‌టక్, ఎవడే సుబ్రహ్మణ్యం
స్వామి	:	కోర్ట్
శివజ్యోతి	:	పెళ్లికానిప్రసాద్
అనుశ్రీ	:	శబ్ధం
ఊర్వశి	:	కోర్ట్
మేనక	:	ఆర్టిస్ట్,కిస్‌కిస్‌కిసిక్
రంభ	:	షణ్ముఖ
కుమారి	:	రిటర్న్‌ఆఫ్‌దిడ్రాగన్
అప్సర	:	సలార్
అశోక	:	చావా
నామవరం		
వీఎస్.మహల్	:	పెళ్లికానిప్రసాద్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	కోర్ట్
కడియం		
వెంకటసూర్య	:	కోర్ట్